
సాక్షి
మంచిర్యాల

శుక్రవారం । 13 । జనవరి । 2023



అమ్మ చెంత.. అదే చింత

బాసర ఆలయంలో అమ్మవారి జన్మనక్షత్రం వేడుకలకు సమయం సమీపిస్తోంది. వీఐపీల తోపాటు భక్తుల తాకిడీ ఎక్కువగానే ఉంటుంది. అసౌకర్యాలు స్వాగతం పలుకనున్నాయి. IIలో



ముగ్గుల సంబురం IIIలో

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 /15.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వాయువ్యం దిశగా చలిగాలులు వీస్తాయి. చలి తీవ్రత స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మార్కెట్ యార్డుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులోని సర్వేనంబరు 159లో గల దాదాపు నాలుగు ఎకరాల స్థలాన్ని మార్కెట్ యార్డు కోసం జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ గురువారం పరిశీలించారు. మంచిర్యాల మార్కెట్ కమిటీ ప్రభుత్వ వైద్య కళాశాలకు కేటాయించడంతో మార్కెట్ కమిటీ కార్యాలయం, యార్డు కోసం స్థలం కేటాయించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్ ఎమ్మెల్యే దివాకర్‌రావు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. హాజీపూర్ మండల పరిధిలో స్థలం ఎంపిక కోసం తహసీల్దార్ రాజలింగుకు ఆదేశాలు జారీ చేయగా వేంపల్లి శివారులోని స్థలాన్ని గుర్తించారు. స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ మార్కెట్ యార్డు సాధ్యాసాధ్యాలను పరిశీలించి పరిసర ప్రాంత వివరాలను ఆరా తీశారు. స్థానిక సర్పంచ్ వోలపు శారద, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ, నాయకులు వోలపు రమేశ్, తిరుపతి, తహసీల్దార్ రాజలింగు, సర్వేయర్ మధూకర్ పాల్గొన్నారు.


సేవ చేసేందుకు ముందుకు రావాలి

మంచిర్యాలటౌన్: స్వామి వివేకానందుని అడుగుజాడల్లో నడుస్తూ, స్వచ్ఛందంగా సేవ చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని యువజన క్రీడల శాఖ కార్యాలయంలో గురువారం స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్వాగత నృత్యంతో బాల కళాకారిణి, రాష్ట్ర అవార్డు గ్రహీత అభీర ఆకట్టుకుంది. జిల్లాలో వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థల అధ్యక్షులు, సభ్యుల్లోని 30 మందిని ఘనంగా సన్మానించారు. యువజన అవార్డులను పొందిన వారిలో అభినవ సంతోష్‌కుమార్, తగరపు సత్తయ్య, ముల్కల్ల కుమార్, బత్తుల శ్రీనివాస్, కాంపెల్లి విజయ్‌కుమార్, సరిత ఓజా, తిరుపతి, సాబీర్, బి.చరణ్‌తేజ, పి.సుస్మిత, ఆర్.జ్యోతి, చిప్పకుర్తి నవీన్, సాధిక్, అక్షయ్‌కుమార్, మల్యాల రాజన్న, నవీన్, జైకుమార్, తిరుపతిలకు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో నరేందర్, మత్స్యశాఖ జిల్లా అధికారి సత్యనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రాళ్లవాగును రక్షించాలని వినతి

మంచిర్యాలఅగ్రికల్చర్: రాళ్లవాగును రక్షించాలని తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. వాగును ఆక్రమించుకుని హైలైఫ్ హోటల్, మ్యాక్స్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజేఎస్, బీఎస్పీ జిల్లా నాయకులు బచ్చలి ప్రవీణ్, జాగిరి రాజేష్, ఎన్సీపీ నాయకులు గోపాల్, టీవీఎస్ రేగుంట క్రాంతి, పురెళ్ల నితీష్ పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయాలపై తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారులు

మంచిర్యాలక్రైం: చైనా మాంజా విక్రయాలపై జిల్లా అటవీశాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. గత ఏడాది జిల్లా కేంద్రం పాతమంచిర్యాలలోని రాళ్లవాగు బ్రిడ్జిపై ఓ వలస కూలీ చైనా మాంజాకు బలైన విషయం తెలిసిందే. జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని పలు దుకాణాల్లో మంచిర్యాల డిప్యూటీ రేంజ్ అధికారి కే.మమత, మందమర్రి డిప్యూటీ రేంజ్ అధికారి పి.సంతోష్, ఎఫ్ఎస్‌వోలు విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, ఎఫ్‌బీవో శ్రీనివాస్, సతీష్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. తనిఖీలకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రూ.33 వేలు రికవరీకి ఆదేశాలు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలంలో బుధవారం నిర్వహించిన 13వ ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదికలో పలు గ్రామ పంచాయతీల్లో జరిగిన అక్రమాలు వెలుగు చూశాయి. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో పనులు చేపట్టకుండా నిధులు దుర్వినియోగం చేసినట్లు అధికారులు ప్రజావేదికలో తేల్చారు. అక్రమాలకు పాల్పడిన వారికి రూ.45 వేలు జరిమానా విధించగా, మరో రూ.33 వేలు రికవరీ చేయడానికి ఆదేశాలు జారీ చేశారని మండల ఏపీవో జీనత్ తెలిపారు.

పాడి రైతులకు టోకరా!



బెల్లంపల్లి శివారు కన్నాల గేట్ సమీపంలో సంస్థ కార్యాలయం



ప్రైవేటుకు తోడ్పాటు!

గత ఆగస్టులో 'సాక్షి' ప్రచురించిన కథనం

- ఆవులు, గేదెలు ఇస్తామని రూ.లక్షలు వసూలు
- జిల్లాలో ఓ ప్రైవేటు డెయిరీ నిర్వాహకం
- పలు చోట్ల నిర్వాహకులపై కేసులు నమోదు
- సంస్థ తీరుపై గతంలోనే 'సాక్షి' కథనం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఆవులు, గేదెలు ఇస్తామని ఓ ప్రైవేటు సంస్థ పాడిరైతులకు టోకరా వేసింది. రూ.లక్షలు వసూలు చేసి బోర్డు తిప్పేసింది. బాధిత రైతులు ఒక్కొక్కరుగా బయటకు వస్తుండడంతో మంచిర్యాల జిల్లాలో సంస్థ నిర్వాహకులపై కేసులు నమోదవుతున్నాయి. సంస్థకు డబ్బులు చెల్లించిన తాండూర్, కాసిపేట, నెన్నెల, బెల్లంపల్లి మండలాల రైతులు స్థానిక పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. డబ్బులు చెల్లించిన రైతులు గేదెలు ఇవ్వడం లేదని స్థానికంగా ఉన్న ఏజెంట్లను నిలదీయగా, సంస్థ ఎండీని బెల్లంపల్లికి పిలిపించారు. అక్కడ సరైన సమాధానం రాకపోవడంతో ఈ నెల 11న ఏకకాలంలో పలు చోట్ల పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు చేయగా, నిర్వాహకులను పోలీసులు అదుపులో తీసుకుని విచారణ చేస్తున్నారు. వారిపై చీటింగ్, బలవంతపు వసూళ్లు, బెదిరింపుల నేరాల కింద ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేశారు. ఈ సంస్థ స్కీంల పేరుతో జిల్లాలో ప్రచారం చేస్తోందని, ఇందుకు ప్రజాప్రతినిధులు, పశు సంవర్ధక శాఖ అధికారులు సహకరించడంపై గత ఆగస్టు 23న 'సాక్షి'లో 'ప్రైవేటుకు తోడ్పాటు' శీర్షికన ఓ కథనం ప్రచురించింది.



సంస్థ చేసిన ప్రచారం

రైతులకు లాభాల ఆశ చూపి..

పాడి రైతులకు తక్కువ ధరలకే గేదెలు, ఆవులు ఇస్తామని, వాయిదా పద్ధతిలో చెల్లించాలని నిర్వాహకులు ప్రచారం చేశారు. ఇందుకోసం ఏజెంట్లు, కొంతమందిని సంస్థలో చేర్పించుకుని వారికి జీత, భత్యాలు ఇస్తామని చెప్పారు. కొత్తగా చేరబోయే పాడి రైతులు కొంత మొత్తంలో చెల్లిస్తే.. మరికొంత సంస్థ రుణ రూపంలో ఇచ్చి పాడి పశువులు అందజేస్తామని ప్రచారం చేశారు. వాయిదాల పద్ధతిలో చెల్లించాలని ఆఫర్లు ప్రకటించారు. దీంతో జిల్లాలో చాలా మంది రైతులు నమ్మి కొందరు డబ్బులు చెల్లించారు. కొంతమందికి గేదెలు, ఆవులు ఇవ్వగా ఇంకొన్ని చోట్ల ఇవ్వలేదు. ఇక బీమా కోసం రూ.708కడితే పశువులు చనిపోతే గరిష్టంగా రూ.50వేల బీమా వర్తిస్తుందని ప్రకటించారు. ఇవన్నీ ఆచరణలో సాధ్యం కాలేదు. కొన్ని పాడి పశువులు చనిపోతే బీమా కూడా చెల్లించకపోవడతో చెక్కులు బౌన్స్ అయిన ఘటనలు ఉన్నాయి. తాజాగా ఒక్కొక్కరు బయటకు వస్తుండడంతో ఈ వ్యవహారమంతా బయపడుతోంది. బెల్లంపల్లి నియోజకవర్గంలో స్థానికుల సహకారంతో దళితబంధు కింద డెయిరీ యూనిట్లు కమీషన్ల కింద ఈ సంస్థ ఆధ్వర్యంలోనే గేదెలు, ఆవులను అందించేలా ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది.

రూ.లక్షల్లో చెల్లించిన రైతులు

జిల్లాలో ప్రభుత్వ రంగ సంస్థ విజయ డెయిరీ కాదని ఓ ప్రైవేటు సంస్థకు ప్రత్యక్ష, పరోక్షంగా కొందరు సహకరించడంతో ప్రైవేటు సంస్థ రైతుల నుంచి రూ.లక్షలు వసూలు చేసిందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే ఈ కంపెనీపై పలు చోట్ల ఫిర్యాదులు వచ్చాయి. మంచిర్యాల జిల్లాలో జైపూర్, బీమారం, జన్నారం, సోమగూడెం, బెల్లంపల్లి, తాండూరు, కాసిపేట, నెన్నెల తదితర మండలాల్లో రైతుల చేరారు. బెల్లంపల్లి పట్టణం కన్నాల శివారు అసైన్డ్ భూమిలోనే పాల శీతల కేంద్రం ఏర్పాటుకు భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చిన్నయ్యతో సహా అప్పటి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్, తదితరులు హాజరయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారుల హాజరుతో చాలామంది నమ్మారు. ఒక్కొక్కరికి ఒక్కో స్కీం డబ్బులు చెల్లించే స్థాయిని బట్టి చేర్పించారు. కనీసం రూ.70వేల నుంచి రూ.3.50లక్షల వరకు చెల్లించారు. ముందుగా కొంత మొత్తంలో రైతులు చెల్లిస్తే అంతే మొత్తంలో సంస్థ కలిపి, రుణం రూపంలో పాడి పశువుల్ని ఇస్తుందని చెప్పుకొచ్చారు. చాలా చోట్ల రూ.లక్షల్లో డబ్బులు చెల్లించారు. ఐదు నెలల క్రితం ఐబీ తాండూరుకు చెందిన ఓ మహిళ పది పాడి పశువులు తీసుకుంది. సకాలంలో సంస్థకు వాయిదాల డబ్బులు చెల్లించడం లేదని నిర్వాహకులే ఆ రైతుపై కేసు పెట్టారు. ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకున్నారు. తాజాగా ఈ నెల 11న ఒకే రోజు పలు చోట్ల సంస్థపై రైతులు కేసులు పెట్టారు. ప్రస్తుతం సంస్థ నిర్వాహకులు, ఏజెంట్లు, సిబ్బంది ఫోన్‌నంబర్లు స్విచ్ఛాఫ్ వస్తుండగా, ఆఫీసు మూసివేసి ఉంది.

పందెం కోడి రెడీ..!



మహారాష్ట్ర-తెలంగాణ ప్రాణహిత పరీవాహక ప్రాంతంలో పట్టుబడిన పందెంరాయుళ్లు(ఫైల్)

- రహస్యంగా నిర్వహణకు వ్యూహం
- రూ.లక్షల్లో పందెంరాయుళ్ల బెట్టింగ్



స్వాధీనం చేసుకున్న కత్తులు(ఫైల్)

మంచిర్యాలక్రైం: సంక్రాంతి పండుగ సందర్భంగా పందేలకు కోళ్లు రెడీ అవుతున్నాయి. ఆంధ్రా ప్రాంతంలో ఎక్కువగా కోళ్ల పందేలు జరుగుతుండగా.. జిల్లాలోనూ జోరందుకుంటున్నాయి. బెట్టింగ్‌కు పందెంరాయుళ్లు సై అంటున్నారు. కోడిపందేల నిర్వహణకు ఇప్పటికే జిల్లాలోని మందమర్రి, కోటపల్లి, నెన్నెల, నీల్వాయి, లక్సెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల, గోదావరి పరీవాహ ప్రాంతాలు, సరిహద్దు గ్రామాల్లో పందేల నిర్వహణకు రహస్య స్థావరాలను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఈసారి పండుగ సందర్భంగా కోడిపందేల నిర్వహణకు పలువురు తమదైన శైలిలో వ్యూహారచన చేస్తున్నట్లు తెలిసింది. పోలీసులు ఆంక్షలు విధించినా పందేలు నిర్వహించాలనే ఉత్సాహంతో రహస్యంగా సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పందెం కోళ్లకు శిక్షణ ఇస్తున్నట్లు సమాచారం.

చూపుడు పందేలే అధికం..

కోడి పందేల్లో అనేక రకాలు ఉన్నా జిల్లాలో చూపుడు పందేలు అధికంగా జరుగుతుంటాయి. అంటే బరిలోకి దింపే కోడిపుంజులను ముందే చూపించాల్సి ఉంటుంది. పుంజులకు కత్తులు కట్టించి, కత్తులు లేకుండా సాధారణ పందేలు నిర్వహిస్తుంటారు. సుమారు రూ.5వేల నుంచి రూ.లక్ష వరకు పందెం కాస్తుంటారు. కత్తులు కట్టే వారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకుంటారు. వారికి డిమాండ్ ఉంటుంది. ఒక్కసారి పుంజుకు కత్తి కట్టినందుకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు తీసుకుంటారు. కత్తులను సైతం పందెంరాయుళ్లు ముందస్తుగానే చెన్నయ్ నుంచి తెప్పిస్తున్నట్లు సమాచారం. అవి తేలికగా, చాలా పదునుగా ఉంటాయి.

- గత ఏడాది జనవరి 7న హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ పంచాయతీ పరిధి కోలాంగూడ శివారు అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు కోడిపందేలు ఆడుతున్న 12మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి ఏడు కత్తులు, 12 ద్విచక్ర వాహనాలు, 12సెల్‌ఫోన్లు, రూ.26,400 స్వాధీనం చేసుకున్నారు.
- గత ఏడాది ఫిబ్రవరి 5న మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దు ప్రాణహిత పరీవాహక అటవీ ప్రాంతంలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన వారు కోళ్ల పందేలు నిర్వహించగా కోటపల్లి పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. 28మందిని అదుపులోకి తీసుకుని నాలుగు పందెం కోళ్లు, ఐదు కత్తులు, ఏడు వాహనాలు, రూ.లక్షా 51వేలు నగదు, 26 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత టాస్క్‌ఫోర్స్ పోలీసులు గానీ, పోలీసులు గానీ దాడులు చేసిన దాఖలాలు లేవు.

ప్రత్యేక నిఘా..



కోడిపందేలపై ప్రత్యేక బృందాలు, నిఘా ఏర్పాటు చేశాం. ఎవరైనా పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు. పాత నిర్వాహకులపై దృష్టి సారించాం. కోడిపందేలు, అక్రమ దందాలు, అక్రమ రవాణా, గంజాయి, పేకాట తదితర వాటిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ప్రజలు సమాచారం అందించాలి. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతాం.

– అఖిల్ మహాజన్, మంచిర్యాల ఇన్‌చార్జి డీసీపీ

జిల్లాలో నమోదైన కేసులు

సంవత్సరం	కేసులు	అరెస్టయినవారు	స్వాధీనం చేసుకున్న నగదు(రూ.లలో)
2021	4	29	34,100
2022	2	40	1,77,400

కంటి వెలుగు ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి

- మౌలిక సౌకర్యాలు కల్పించాలి
- ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు



పాల్గొన్న కలెక్టర్ భారతి హోళ్లికేరి

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు అన్నారు. గురువారం జూమ్ మీటింగ్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 18నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న కంటివెలుగు కార్యక్రమం విజయవంతానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని చెప్పారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కార్యాచరణ రూపొందించి ప్రణాళికబద్ధంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లా మండల, గ్రామ స్థాయిలో ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించడంతోపాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. శిబిరాల్లో నీడ కోసం టెంట్లు, కుర్చీలు, టేబుళ్లు, తాగునీరు, తదితర మౌలిక సౌకర్యాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ భారతి హోళ్లికేరి మాట్లాడుతూ రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని, శిబిరాల నిర్వహణ కోసం 40 బృందాలు, రెండు బఫర్ బృందాలను ఏర్పాటు చేశామని, 42 ఆర్ మిషన్లు 45 ట్రైలెన్స్ బాక్సులు, కళ్లద్దాలు ఇతరత్రా సామగ్రి సమకూర్చామని వివరించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌రాజ్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సుబ్బరాయుడు, అధికారులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనాల పరిశీలన



ఇందన్‌పల్లిలో అదనపు కలెక్టర్ మధుసూదన్

జన్నారం: మండలంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ గురువారం ఆకస్మికంగా పర్యటించారు. తిమ్మాపూర్, ఇందన్‌పల్లి, కొత్తపేట, లింగయ్యపల్లి, రోటిగూడ గ్రామాల్లో పల్లెప్రకృతి వనాలను పరిశీలించారు. క్రీడా మైదానాలను పరిశీలించి అందుబాటులోకి తేవాలని సూచించారు. పల్లె ప్రకృతి వనాల్లో విరివిగా మొక్కలు పెంచాలని, కలుపు మొక్కలు తొలగించాలని, పచ్చగా ఉండేలా నీరు పోయాలని సూచించారు. క్రీడా ప్రాంగాణాలు, ఇందన్‌పల్లిలో బృహత్ ప్రకృతి వన స్థలం పరిశీలించారు. ఎంపీడీవో అరుణరాణి, తహసీల్దార్ కిషన్, సర్పంచులు పాల్గొన్నారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు



రైతుల నుంచి సేకరించిన ధాన్యం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వానాకాలంలో సాగు చేసిన పంటల ధాన్యం సేకరణ ముగిసింది. కొనుగోలు కేంద్రాలను ఎత్తి వేసి ధాన్యాన్ని పూర్తిస్థాయిలో మిల్లులకు తరలించడం పూర్తయింది. 244 కొనుగోలు కేంద్రాల ద్వారా 25,940 మంది రైతుల నుంచి రూ.316,64,82,032 విలువైన 1,53,712.720 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించి ట్యాబ్‌లో ఎంట్రీ చేశారు. ఇప్పటివరకు 18,862 మంది రైతుల ఖాతాల్లో రూ. 220,89,90,704 జమ చేశారు. సేకరించిన ధాన్యాన్ని జిల్లాలోని 54 మిల్లులకు తరలించారు. గత ఏడాది వానాకాలం, యాసంగిలో సేకరించిన ధాన్యం పూర్తి స్థాయిలో సీఎంఆర్ కాకపోవడంతో నిల్వలు పేరుకుపోయాయి. రెండు సీజన్లకు సంబంధించి వా నాకాలం 25,495 మెట్రిక్ టన్నులు, యాసంగి 32,421 మెట్రిక్ టన్నులు బియ్యం రావాల్సి ఉంది. నెలాఖరులోగా రెండు సీజన్ల సీఎంఆర్ పూర్తి చేసి అందించాలని, ఈ వానాకాలం ధాన్యం సీఎంఆర్ ప్రారంభించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

డిసెంబర్‌లో పోటెత్తిన ధాన్యం..

గతేడాది 1.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రాగా ఈ ఏడాది 1.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. సాగు విస్తీర్ణం గతేడాది కంటే ఐదు వేల ఎకరాల వరకు తగ్గినా ఈ ఏడాది ధాన్యం 16 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. నారుమడులు, వరినాట్లు ఆలస్యం కావడంతో నవంబర్ నుంచి దిగుబడి రావాల్సి ఉండగా ఉండగా డిసెంబర్‌లో కోతకు వచ్చింది. దీంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తింది.



మంచిర్యాల బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



మంచిర్యాల బస్టాండ్‌లో బస్సు వద్ద గుమిగూడిన ప్రయాణికులు



బస్టాండ్ ఎదుట ప్రైవేటు వాహనాలలో వెళ్తున్న ప్రజలు

కిక్కిరిసిన ప్రయాణం



బ్యాగులు తీసుకుని ఇళ్లకు వెళ్తున్న విద్యార్థినులు

- సంక్రాంతి పండుగతో పెరిగిన రద్దీ
- ప్రయాణికులకు తప్పని అవస్థలు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో గురువారం ఆర్టీసీ బస్సులు, బస్‌స్టేషన్ కిటకిటలాడాయి. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ప్రజలు బస్టాండ్లకు చేరుకోవడంతో ప్రాంగణాలు, బస్సులు కిక్కిరిసిపోయాయి. సీట్ల కోసం బస్సులు రాగానే పరుగులు తీశారు. కొందరు కిటికీల్లో నుంచి సీట్ల కోసం ప్రయత్నించారు. మంచిర్యాల ఆర్టీసీ డిపో పరిధిలో 138 బస్సులు ఉండగా 38 హైదరాబాద్‌కు రెగ్యులర్‌గా రాకపోకలు సాగిస్తాయి. పండుగ పూట ప్రత్యేక బస్సులు 20 హైదరాబాద్‌కు నడుపగా జిల్లా వ్యాప్తంగా మిగిలిన 80 బస్సులు నడిపారు. దీంతో పిల్లలను తీసుకెళ్లేందుకు పట్టణాలకు వచ్చిన వారంతా గ్రామాలకు తిరిగి వెళ్లేందుకు రావడంతో బస్‌స్టేషన్ జనంతో నిండాయి.

ప్రయాణికులకు తప్పని పాట్లు..

ఆసిఫాబాద్, చెన్నూర్ వైపు వెళ్లే బస్ పాయింట్ల వద్ద ప్రయాణికులు గంటలకొద్దీ వేచి చూశారు. బస్సులు సమయానికి రాకపోవడం, కూర్చోడానికి సీట్లు సరిపోకపోవడంతో మూడేసి గంటలు నిల్చోవాల్సి వచ్చింది. బస్సు వచ్చిందంటే చాలు చుట్టుముట్టడం ప్రయాణికుల వంతైంది. హైదరాబాద్, కరీంనగర్ నుంచి వచ్చిన విద్యార్థులు కౌటాల, కాగజ్‌నగర్ తదితర ప్రాంతాలకు బస్సుల్లేక విసుగుచెందారు.

ప్రైవేటు వాహనాల్లో..

బస్సుల కోసం విసిగి వేసారిన ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పలేదు. అద్దె వాహనాల చార్జీలు విపరీతంగా పెంచేశారు. హైదరాబాద్‌కు రూ.6200 కాగా ప్రస్తుతం రూ.7వేల నుంచి రూ.7,200 వరకు తీసుకున్నారు. ఇంకోవైపు బెల్లంపల్లి, చెన్నూర్ తదితర ప్రాంతాల వైపు ప్రయాణికులు ఆటోల్లో కిక్కిరిసి వెళ్లారు. కొన్ని ప్రాంతాలకు వెళ్లే ఆటోలో అందినకాడికి దండుకున్నట్లు తెలుస్తోంది. నిబంధనలు అతిక్రమించి ప్రయాణికులను తరలించారు.



ద్విచక్ర వాహనంపై వెళ్తున్న విద్యార్థులు

రద్దీకి తగ్గట్టు బస్సుల్లేవు..



సంక్రాంతి పండుగ వచ్చిదంటే నగరాలకు వెళ్లి చదవుకునే విద్యార్థులు, ఉద్యోగరీత్యా వెళ్లిన వారంతా తిరిగి స్వగ్రామాలకు చేరుకుంటారు. అందుకు తగినట్టుగా బస్సులు నడపడంలో ఆర్టీసీ యాజమాన్యం విఫలమైంది. నా కుమారుడు కరీంనగర్ తిమ్మాపూర్ సైనిక్ స్కూల్‌లో చదువుతున్నాడు. పాఠశాలకు సెలవులు ఇవ్వడంతో తీసుకుని కౌటల వెళ్లేందుకు బస్‌స్టేషన్‌కు వచ్చాను. దాదాపు రెండున్నర గంటలు దాటింది. ఒక్కబస్ రాలేదు.. వచ్చినా సీటు దొరకుతుందనే నమ్మకం లేదు. మరో నాలుగు గంటలు నిల్చొనే వెళ్లాలి. బస్సు ఎప్పుడు వస్తుంది.. ఇంటికి ఎప్పుడు చేరుతామో తెలియని పరిస్థితి.

– పండిత్, కౌటాల, ప్రయాణికుడు

సంక్రాంతి సెలవులతో ఇంటిబాట

విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో గురువారం విద్యార్థులు ఇంటిబాటపట్టారు. ఈ నెల 17వరకు పాఠశాలలకు, 13నుంచి 15వరకు కాలేజీలకు సెలవులు ప్రకటించారు. వసతితో కూడిన విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల కోసం తల్లిదండ్రులు, బంధువులు వచ్చి వెంట తీసుకెళ్లారు.

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల్లో 16 మంది డిబార్

ఆదిలాబాద్‌టౌన్‌: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ సెమిస్టర్ 3, 5 పరీక్షలు జరుగుతున్నాయి. గురువారం జరిగిన పరీక్షల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16 మంది డిబార్ అయినట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. ఇచ్చోడలోని సాయిసమత్ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, ఇచ్చోడ కాకతీయ డిగ్రీ కళాశాలలో ఐదుగురు, రెబ్బెనలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ముగ్గురు, ఆదిలాబాద్ పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఇద్దరు, లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక్కరు, మంచిర్యాల రిమ్స్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు.

వ్యక్తికి 15 రోజుల రిమాండ్

లక్సెట్టిపేట(మంచిర్యాల): మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన ఇబ్రహీం అనే వ్యక్తికి స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి అసుదుల్లా షరీఫ్ గురువారం పదిహేను రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇబ్రహీం అదే గ్రామానికి చెందిన ఒక యువతిని ప్రేమిస్తున్నానని వేధించడం, ఇంటికి వెళ్లి బైక్ హారన్ కొడుతూ ఇబ్బందులకు గురిచేస్తుండడం, బయటకు రమ్మని బూతులు తిట్టడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఈ నెల 11న కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఆదివాసీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

కాసిపేట(బెల్లంపల్లి): మండలంలోని దేవాపూర్ పరిసర గ్రామాల ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ స్థానిక ఆదివాసీలు గురువారం ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఎండి క్షేత్రపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీలో స్థానికేతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఆదివాసీ లకు అన్యాయం చేస్తున్నారన్నారు. తుడుందెబ్బ మండల అధ్యక్షుడు ఆత్రం జంగు, ప్రధాన కార్యదర్శి మడావి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు ఆత్రం సంజీవ్, నాయకులు పేంద్రం ప్రభాకర్, పేంద్రం హన్మంతు, కనకరాజు, రాయిసిడాం రాందాస్, ఆత్రం మహేష్, భీంరావు, తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి



లతకు చెక్కు అందిస్తున్న జెడ్పీటీసీ

బెల్లంపల్లి: సంక్రాంతిని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ముగ్గుల పోటీల్లో బెల్లంపల్లి మహిళ ప్రథమ బహుమతి గెలుచుకుంది. పాలకుర్తి జెడ్పీటీసీ సభ్యురాలు కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో బెల్లంపల్లికి చెందిన ఆసం లత పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సంధ్యారాణి విజేతకు రూ.30వేల నగదు బహుమతి అందజేశారు.

అమ్మ చెంత అదే చింత



బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం

ఈసారైనా భక్తులకు తిప్పలు తప్పేనా..?

- అమ్మవారి జన్మనక్షత్రం వేడుకలకు దగ్గరపడుతున్న ఘడియలు
- తరలిరానున్న భక్తజనం
- అదేస్థాయిలో వీఐపీల తాకిడి
- ఈసారి కూడా అరకొర వసతులే..
- కనీసం తాగునీరు కూడా దొరకని పరిస్థితి

బాసర(ముథోల్): బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి సన్నిధిలో జరిగే మహోత్సవాల్లో అత్యంత ముఖ్యమైన ఉత్సవం వసంత పంచమి. అమ్మవారి జన్మ నక్షత్రమైన వసంత పంచమిని శ్రీపంచమి అని కూడా అంటారు. ఈ పర్వదినం ఈ నెల 26న రానుంది. ఆ రోజు అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు చేయించడానికి పెద్ద సంఖ్యలో భక్తులు బాసరకు తరలివస్తుంటారు. కానీ ఆలయంలో సరైన వసతులు, ఏర్పాట్లు లేక భక్తులు యేటా తీవ్ర ఇక్కట్ల మధ్య పూజలు చేసుకుని తిరుగు ప్రయాణమవుతున్నారు. ఎప్పటిలాగానే ఈసారి కూడా అధికారులు ఏర్పాట్లు చేయడానికి సన్నద్ధం అవుతున్నారు. వేలల్లో వచ్చే భక్తుల రద్దీని ఊహించినదే అయినా చిన్నచిన్న మార్పులు తప్పితే చెప్పుకోదగిన స్థాయిలో ఏర్పాట్లు చేయడం లేదనే చెప్పొచ్చు. వసంత పంచమికి వచ్చే భక్తులకు ఈ ఏడాది కూడా అవే కష్టాలు ఎదురుకానున్నాయి.

ఏర్పాట్లలో లోపాలు

వసంత పంచమి సందర్భంగా తాత్కాలిక క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నారు. తాగునీటితో పాటు మధ్యలో అత్యవసరమైతే భక్తులు బయటకు వచ్చే పరిస్థితులు కల్పించడం లేదు. గంటల తరబడి నిల్చొనే భక్తులు కూర్చుందామంటే ఏర్పాట్లు చేయడం లేదు. ఏటా వీఐపీల కోసం క్యూలైన్లు.. అక్షర శ్రీకార పూజల కోసం గతంలో అదనపు ఏర్పాట్లు చేసిన అధికారులు సాధారణ భక్తుల విషయాలను మాత్రం గాలికి వదిలేస్తున్నారు.

సమస్యలపై దృష్టి పెట్టని అధికారులు..

గత అనుభవాలను ఆలయ అధికారులు మరచిపోయినట్లే ఉన్నారు. గత నవరాత్రి ఉత్సవాల్లో, వసంతి పంచమి వేడుకల సమయంలో భక్తులకు ఏర్పడిన అసౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేయడం లేదు. అదనపు క్యూలైన్లు, వివిధ దిశల్లో ఆలయంలో అధికారుల పూజలు, దర్శనం త్వరగా జరిగే కోణంలో ఆలోచన చేయడం లేదు. ఆలయ పూజారులు ఉన్నా భక్తుల రద్దీకి సరిపోవడం లేదు. బయట నుంచి అదనంగా పూజారులను తీసుకోవద్దని కొందరు అర్చకులు అధికారులను కోరినట్లు సమాచారం. దీంతో భక్తుల దర్శన సమయం పెరిగి ఇబ్బందుల పాలవుతున్నారు. క్యూలైన్ల భద్రత సిబ్బందిని పెంచుతున్నప్పటికీ పూజలు నిర్వహించే పండితుల సంఖ్యను మాత్రం పెంచడం లేదు.

తాగునీరు కష్టమే..



తాగునీటిలో కప్పలు, పురుగులు

అమ్మవారి జన్మనక్షత్ర ఉత్సవాల్లో భక్తులకు కనీసం తాగునీరు దొరకడం కష్టమే. ఇప్పటికే అక్కడక్కడ రెండు మూడు చోట్ల చిన్నవాటర్ కూలర్లు ఉంచి ఆలయ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. గుడి దగ్గరికి వచ్చిన భక్తులు క్యూలైన్ల ద్వారా అమ్మవారి దర్శనానికి వెళ్లే దత్తాద్రి గుడి వద్ద మరొకటి టెంకాయ కొట్టు ప్రదేశం వద్ద మాత్రమే వాటర్ కూలర్లు ఉన్నా అందులో తాజాగా కప్పలు, పురుగులు దర్శనమిస్తున్నాయి. నిర్వహణ సరిగాలేక నల్లాల వద్ద అపరిశుభ్రత చూసి ఆ నీరు తాగడానికి కూడా భక్తులు ఇష్టపడడం లేదు. ఇప్పటి వరకు అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు మొదలైనట్లు కనిపించడం లేదు.

కొరవడిన వసతి

ఉత్సవాల్లో బాసర అమ్మవారి దర్శనానికి వచ్చే వీఐపీ భక్తుల బసకు పాత ఆలయ అతిథి గృహాలను రూ.6కోట్లతో రినోవేషన్ చేసి సకల హంగులతో సిద్ధం చేశారు. కానీ సాధారణ భక్తుల బసను పట్టించుకున్న పాపన పోవడం లేదు. కేవలం రెండు వందల రూపాయల రుసుముతో బస కల్పించే టీటీడీ వసతి గృహంలో ప్రస్తుతం ఉపయోగానికి దాదాపు సగం రూములు మాత్రమే ఉన్నాయి. అవి కాస్త దీనస్థితిలో ఉండడం, ప్రైవేటు లాడ్జిల్లో వేల రూపాయలు వసూలు చేయడంతో భక్తులకు ఇబ్బంది తప్పడం లేదు.



ఆలయ రూంలు దొరకక, ప్రైవేటు రేట్లకు తట్టుకోలేక చలిలో ఆరుబయట నిద్రపోతున్న భక్తులు (ఫైల్)

‘ఓపెన్’లో స్పెషల్ అడ్మిషన్లు

- ‘పది’ ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- నేటితో ముగియనున్న గడువు



అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్‌: 2022–23 విద్యాసంవత్సరానికి ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశానికి స్పెషల్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. జనవరి 9 నుంచి 13 వరకు విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. చదువు మధ్యలో మానేసిన వారు, ఎస్సెస్సీ, ఇంటర్‌లో ఫెయిలైన వారంతా ఓపెన్ విధానం ద్వారా ఒకే సంవత్సరంలో పూర్తి చేసే వీలుంది. ఈ విద్యాసంవత్సరానికి గానూ ఇప్పటి వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓపెన్ ఇంటర్‌లో 2,271 మంది, పదోతరగతిలో 2,490 మంది విద్యార్థులు ప్రవేశం పొందినట్లు ఓపెన్ స్కూల్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ అశోక్ తెలిపారు.

అర్హతలు ఇవే..

2022 ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాలు నిండినవారు పదోతరగతి, 15 సంవత్సరాలు నిండి పదోతరగతి పాసైనవారు ఇంటర్‌లో ప్రవేశానికి అర్హులు. పదోతరగతిలో ప్రవేశానికి జనరల్ విద్యార్థులకు రూ.1400, ఇతరులకు రూ.1000, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.150, ఇంటర్‌లో ప్రవేశానికి జనరల్ విద్యార్థులకు రూ.1500, ఇతరులకు రూ.1200, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300 ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది.

2022-23 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు

జిల్లా	ఎస్సెస్సీ	ఇంటర్
ఆదిలాబాద్	808	401
కుమురంభీం	380	278
మంచిర్యాల	589	1,144
నిర్మల్	713	448

సాగునీటికోసం రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

లక్సెట్టిపేట(మంచిర్యాల): యాసంగి వరి పంటకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా దండేపల్లి, లక్సెట్టిపేట మండలాలకు నీరందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సుమారు రెండు గంటలకు పైగా నిర్వహించిన రాస్తారోకోతో రహదారిపై భారీసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వచ్చి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సంగ్రామ సమితి అధ్యక్షుడు నైనాల వెంకటేశ్వర్లు సీపీఐ నాయకులు రమణారెడ్డి, మేదరి దేవవరం, రైతులు పాల్గొన్నారు.

కోలిండియా పోటీల్లో రాణించాలి

- శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి



ఎంపికైన క్రీడాకారులతో జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): కంపెనీ క్రీడాకారులు కోలిండియా పోటీల్లో రాణించాలని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. బొగ్గు పరిశ్రమల్లో అత్యంత కీలకమైన కోలిండియా క్రికెట్ పోటీలకు సింగరేణి నుంచి పాల్గొనే జట్టుకు శ్రీరాంపూర్ నుంచి బీ.శశికాంత్, ఏనుగు రవికిరణ్, ఎస్.జగదీశ్, ఎస్.మహేశ్, చిరంజీవి ఎంపికయ్యారు. ఈ నెల 16 నుంచి 20 వరకు డబ్ల్యూసీఎల్, నాగ్‌పూర్‌లో జరుగుతున్న కోలిండియా క్రికెట్ పోటీల్లో రాణించి గోల్డ్ మెడల్ సాధించాలన్నారు. ఎంపికైన క్రీడాకారులను గురువారం జీఎం కార్యాలయంలో జీఎం, ఇతర అధికారులు అభినందించారు.

మెరిట్ స్కాలర్ షిప్‌ల పంపిణీ

శ్రీరాంపూర్‌లో పలువురు ఉద్యోగుల పిల్లలకు కంపెనీ మెరిట్ స్కాలర్‌షిప్‌లను మంజూరు చేసింది. ఏడుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున మంజూరు కాగా జీఎం బీ.సంజీవరెడ్డి వారి తల్లిదండ్రులకు అందించారు.

ఎస్‌ఎల్పీ ప్రమోషన్లు అందజేత

శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో పలువురు ఉద్యోగులకు జీఎం సంజీవరెడ్డి సర్వీస్ లింక్డ్ ప్రమోషన్లు అందించారు. పదోన్నతితో మరింత ఉద్యోగ బాధ్యత పెరుగుతుందని, దానికి అనుగుణంగా పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటూ జీఎం త్యాగరాజు, డీజీఎం(పర్సనల్) గోవిందరాజు, డీజీఎం(ఐఈడీ) కే చిరంజీవులు, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, సీనియర్ పీఓ కాంతారావు, జీఎం కార్యాలయం పిట్ సెక్రటరీ పీవీ రావు, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాలకుర్తి రాజు, సూపర్‌వైజర్ అశోక్, కోఆర్డినేటర్ తోట సురేశ్, కెప్టెన్ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌కంట్యాక్స్ రద్దుకు పోరాడుతాం

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య



కాసిపేట గనిపై మాట్లాడుతున్న సీతారామయ్య

కాసిపేట(బెల్లంపల్లి): బొగ్గుగని కార్మికుల ఇన్‌కంట్యాక్స్ రద్దుకు పోరాటం చేస్తామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి, వేజ్‌బోర్డు సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం మందమర్రి ఏరియాలోని కాసిపేటగనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జాతీయ సంఘాల ఐక్యతతో వేజ్‌బోర్డు సమావేశంలో డీపీఈ గైడ్‌లైన్స్ పక్కన పెట్టి కార్మికులకు 19 శాతం ఎంజీబీ సాధించామన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు సింగరేణి కార్మికులకు ఇన్‌కంట్యాక్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణపై క్రియాశీలక పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, నాగేశ్వరరావు, బొంకూరి రాంచందర్, మీనుగు లక్ష్మీనారాయణ, రత్నం అయిలయ్య, కామెర రాములు, రాజేందర్, రవీందర్, డీకొండ నర్సయ్య, స్వామి దాసు పాల్గొన్నారు.

భీమన్న సన్నిధిలో జీఎం పూజలు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని అబ్బాపూర్, బెజ్జాల గ్రామాల పరిధిలో ఉన్న భీమన్న ఆలయంలో ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సతీష్‌బాబు, మేనేజర్ మహేష్‌కుమార్, ఉప సర్పంచ్ పర్వత్‌రావు, కమిటీ సభ్యులు అమృత్‌రావు, రంగుపటేల్, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం సందర్శన

బెల్లంపల్లి ఏరియా యాజమాన్యం ఏర్పాటు చేసిన నర్సాపూర్ సింగరేణి పునరావాస కేంద్రాన్ని జీఎం దేవేందర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం తిరుమల్‌రావు, డీజీఎం సతీష్‌బాబు, మేనేజర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిలో రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

బెల్లంపల్లి: బొగ్గు ఉత్పత్తిలో కార్మికుడి నుంచి మొదలుకుని మేనేజర్ వరకు రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్, మందమర్రి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్, ఏరియా రక్షణాధికారి ఓదెలు అన్నారు. గురువారం మందమర్రి ఏరియాలోని శాంతిఖని భూగర్భ గనిపై సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు, పర్యవేక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గని లో చేపట్టాల్సిన రక్షణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు విపులంగా వివరించారు. కార్యక్రమంలో గని ప్రాజెక్టు అధికారి ఆర్.విజయ్ ప్రసాద్, ఎస్ఎంటీసీ ఇన్‌చార్జి విజయ్‌కుమార్, గని మేనేజర్ సంజయ్‌కుమార్‌సిన్హా , రక్షణాధికారి రాజు, పిట్ ఇంజినీర్ రాంబాబు, కార్మిక సంఘాల ప్రతినిధులు శ్రీనివాస్, తిరుపతిగౌడ్, వెంకటరమణ, రమేశ్, అధికారులు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

పద్మశ్రీ కనకరాజు బృందానికి ప్రథమ స్థానం



మొదటి స్థానాన్ని కైవసం చేసుకుని కర్ణాటకలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

నార్నూర్: యువజన ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్ శిల్పారామంలో నిర్వహించిన కళాపోటీల్లో జైనూర్ మండలంలోని మార్లావాయి గ్రామానికి చెందిన పద్మశ్రీ కనక రాజు కళాబృందానికి గురువారం ప్రథమ బహుమతి దక్కిందని సర్పంచ్ ప్రతిభ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లోని శిల్పారామంలో జరిగిన కళా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మార్లావాయి గ్రామానికి చెందిన పద్మశ్రీ కనక రాజు గుస్సాడీ కళాబృందం

డెయిరీఫాం సీఈఓపై కేసు నమోదు

బెల్లంపల్లి: నమ్మించి మోసగించిన ఓ డెయిరీఫాం నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏకకాలంలో తాండూర్, బెల్లంపల్లి, కాసిపేట, నెన్నెల పోలీసు స్టేషన్లలో బుధవారం బాధితులు ఫిర్యాదు చేశారు. బెల్లంపల్లి కేంద్రంగా కన్నాల శివారు ప్రాంతంలో డెయిరీఫాం నిర్మాణానికి ఓ ప్రజాప్రతినిధి భూమిపూజ చేశారు. కార్యక్రమానికి పశు సంవర్ధక శాఖ అధికారులు హాజరు కావడంతో రైతులకు నమ్మకం కలిగింది. రూ.3.50 లక్షలు చెల్లిస్తే సంస్థ మరో రూ.3.50 లక్షలు కలిపి రూ.7 లక్షల విలువైన పాడిగేదెలను ప్రైవేట్ డెయిరీఫాం నిర్వాహకులు రైతులను ఆకట్టుకున్నారు. దీంతో ఆశపడ్డ రైతులు రూ.2 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు సీఈఓకు చెల్లించారు. ఆరునెలల్లోగా పాడి గేదెలు అందిస్తామని డబ్బులు తీసుకున్న నిర్వాహకులు గడువు తీరినా ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు రైతులు గ్రహించారు. బుధవారం నాటకీయంగా సీఈఓను బెల్లంపల్లికి రప్పించి నిలదీయడంతో తనవద్ద డబ్బులు లేవని చేతులెత్తేశాడు. అప్రమత్తమైన రైతులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టిచ్చారు. అసెంబ్లీ నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 60 మందికి పైగా రైతుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

మోసగించిన వ్యక్తిపై ...

కాసిపేట(బెల్లంపల్లి): సబ్సిడీపై గేదెలు ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గంగారాం తెలి పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కాసిపేటకు చెందిన సింగరేణి కార్మికుడు నలి గేటి రాజేందర్ వద్ద హైదరాబాద్‌కు చెందిన కందిమల్ల ఆదినారాయణ ఓరిజిన్ అనే డెయిరీఫాం బెల్లంపల్లిలో ప్రారంభించినట్లు పరిచ యం చేసుకున్నాడు. నీకు 10 గేదెలు ఇప్పిస్తానని వాటికి రూ.10లక్షలు అవుతుందని, అందులో మూడున్నర లక్షలు కడితే ఆరున్నర లక్షలు మాఫీ చేయిస్తానని రాజేందర్‌ను నమ్మించాడు. తన వద్ద అంత డబ్బులు లేవని రూ.2లక్షలు మాత్రమే ఉన్నాయని చెప్పడంతో అవి తీ సుకుని రూ.8లక్షలు మాఫీ చేయిస్తానని హామీ ఇచ్చాడు. కొద్ది రోజులకు లోన్‌కు షూరిటీగా ఖాళీ చెక్కులు మూడు కావాలని తీసుకున్నా డు. ఆ తర్వాత డబ్బులు ఇవ్వకుండానే ఖాళీ చెక్కులు నావద్ద ఉన్నాయని బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

వాంకిడి(ఆసిఫాబాద్): ఉరేసుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన మీర్జా జావెద్ బేగ్, అంజూమ్(22) దంపతులు మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో కొంత కాలంగా నివాసం ఉంటున్నారు. జావెద్ కూలీ పని చేస్తుండగా అంజూమ్ ఇంటివద్దే ఉంటోంది. గురువారం మధ్యాహ్నం మీర్జాజావేద్‌బేగ్ బయటకు వెళ్లిన సమయంలో అంజూమ్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గంట తర్వాత ఇంటికి వచ్చిన భర్త ఇంటి బయట పిల్లలు ఏడుస్తూ ఉండటాన్ని గమనించి వెనుక తలుపు నుంచి ఇంట్లోకి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించింది. స్థానికుల సహాయంతో కిందికి దింపగా కొనఊపిరితో ఉందని తెలుసుకుని హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దంపతులకు కుమారుడు (4), కుమార్తె (1) ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై ఎస్సై సాగర్‌ను సంప్రదించగా మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందలేదని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

జన్నారం(ఖానాపూర్): మండలంలోని ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన గడ్డం రాయనర్సు అనే గీత కార్మికుడు గురువారం తాటిచెట్టు పైనుంచి కింద పడడంతో గాయాలపాలయ్యాడు. ఉదయం తాటిచెట్టు ఎక్కుతుండగా కాలుకున్న గుజి ఊడిపోవడంతో కిందపడిపోయాడు. గమనించిన తోటి గీత కార్మికులు వెంటనే 108 వాహనంలో లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సకోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధిత గీత కార్మికుడికి ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు మూల భాస్కర్‌గౌడ్ కోరారు.

కలప పట్టివేత



పట్టుకున్న కలపతో అధికారులు

కోటపల్లి(చెన్నూర్): మండలంలోని జనగామ నుంచి నాగంపేట మీదుగా టవేరా వాహనంలో 25 కలప దుంగలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో రవి తెలిపారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడని, కలపను డిపోకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. కలప విలువ సుమారు రూ.లక్షా రెండువేల రూపాయలు ఉంటుందన్నారు. అక్రమంగా కలప రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలపను పట్టుకున్న వారిలో డెప్యూటీ రేంజర్ లావణ్య, బీట్ ఆఫీసర్ సంతోశ్, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట గ్రామ శివారులోని గోదావరి నదీతీరం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వేంపల్లి గ్రామ శివారు నుంచి ఇసుక తరలిస్తే ట్రాక్టర్లు సీజ్ చేస్తామని తహసీల్దార్ రాజలింగు హెచ్చరించారు.

పలువురి బైండోవర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ గ్రామానికి చెందిన రేగుంట అశోక్‌ను గురువారం పోలీసులు తహసీల్దార్ రాజలింగు ఎదుట బైండోవర్ చేశారు. సదరు వ్యక్తి గతంలో గుడుంబా తయారు చేస్తూ పట్టుబడగా పలు కేసులు నమోదయ్యాయని, గుడుంబా తయారీకి పాల్పడకుండా ముందస్తుగా బైండోవర్ చేసి పూచీకత్తుపై వదిలిపెట్టారు.

భీమిని(బెల్లంపల్లి): కన్నెపల్లి మండల కేంద్రంలో గతేడాది కోడి పందేలు ఆడుతూ పట్టుబడిన 14 మందిని గురువారం ముందస్తుగా తహసీల్దార్ రాంచందర్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.